క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్కాపురం: స్థానిక చింతామణి దుర్గా గణపతి ఆలయంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. చెన్నై నుంచి వచ్చిన వేదపండితులు ఉదయం 6 గంటలకు గణనాథుని ఆలయంలోని మండపంలో గంధం చెక్కలు,నెయ్యితో హోమం నిర్వహించారు. వర్షాలు సకాలంలో వర్షాలు కురిసి అంతా సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని హోమం చేసినట్లు తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పండితులు సూచించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సోమేష్, అప్పలరెడ్డి తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ నగరకార్యదర్శి బూస అప్పలరెడ్డి, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జిసోమేష్, శంకరరావు తదితరులు ప్రారంభించారు.ఆ మార్గన వచ్చే పాదచారులు,వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నాగేంద్ర,సోమేశ్వరరావు,పాత్రుడు,అంబికా రాజు తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావుకు ఘన సత్కారం



రచయిత చలపతిరావును సత్కరిస్తున్న శ్రీరామ్మూర్తి తదితరులు

మల్కాపురం: చిత్రకళా పరిశోధనకు చిరునామా సుంకర చలపతిరావు అని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వంచే కళారత్న పురస్కారం అందుకున్న చలపతిరావును బుధవారం మల్కాపురం శాఖ గ్రంథాలయం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ చలపతిరావు రచయిత, పరిశోధకుడు,జర్నలిస్టు,సామాజిక కార్యకర్త మరియు విమర్శకుడు అని అన్నారు. ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు హేమలత మాట్లాడుతూ చలపతిరావులో అద్భుతమైన పరిశీలనా శక్తి, సృజనాత్మకత ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,ఉపాధ్యాయుడు ప్రకాష్,ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ కృషి



ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం కమ్యూనిటీ ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. గోపాలపట్నం సీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ప్రైవేట్ కంపెనీల సీఎస్సార్ నిధులు రూ.12 లక్షలతో ఇచ్చిన ఆపరేషన్ థియేటర్ ఎక్విప్‌మెంట్‌ను నూతన భవనంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి, సుందరంగా తీర్చిదిద్దాలని జోనల్ కమిషనర్ హేమావతికి సూచించారు. సోలార్ ప్యానళ్లు, పవర్ ప్యానళ్లు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సవితిని నాగమణి, వై.లలిత కుమారి, మజ్జూరి శ్రీనివాసరావులను పరిచయం చేశారు. కార్యక్రమంలో మాజీ సభ్యుడు సీహెచ్ భాస్కరరావు, డీసీహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క వర్షానికే ఇలా..

కోట్లు ఖర్చు పెట్టి గెడ్డను ఆధునికీకరించినా ఫలితం కానరావడం లేదు. ఒక్క వర్షం వస్తే చాలు గెడ్డలో మురుగంతా రోడ్డుపైనే ఉంటోంది. మంగళవారం రాత్రి ఇదే పరిస్థితి ఎదురైంది. ఒక్కరోజు కురిసిన వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే రోజుల తరబడి వానలు పడితే ఇంకెలా ఉంటుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



వర్షం కారణంగా రోడ్డుపైకి వచ్చిన గెడ్డలో మురుగు

- గెడ్డలో మురుగంతా రోడ్డు పైనే..
- యంత్రం ఉన్నా తొలగింపు నామమాత్రమే..
- పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- కోట్లు ఖర్చు పెట్టినా కానరాని ఫలితం

మల్కాపురం:

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, మరిడిమాంబ కల్యాణ మండపానికి అతి సమీపాన, సులభ్ కాంప్లెక్స్‌కు వెనుక సుమారు 15 అడుగుల వెడల్పు, పది అడుగుల లోతుతో గెడ్డ ఉంది. తొలి రోజులలో ఈ గెడ్డ లోతు తక్కువగా ఉండటం, గెడ్డపై ఎత్తయిన గోడలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తేనే చాలు గెడ్డ పొంగి, సమీపంలోని నివాసాల్లోకి మురుగు చేరిపోయేది.

రూ.20 కోట్లతో ఆధునికీకరణ

స్థానికుల ఫిర్యాదు మేరకు, సమస్యను గుర్తించిన జీవీఎంసీ ఉన్నతాధికారులు సుమారు ఆరేళ్ల క్రితం హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధులతో అచ్చినాయుడులోవ ప్రాంతం నుంచి మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వరకు గల సుమారు రెండు కిలో మీటర్ల పరిధిలో గెడ్డను సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునికీకరించారు. అందులో భాగంగా మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద గల గెడ్డను కూడా ఆధునికీకరించారు. అయినప్పటికీ గెడ్డలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వ్యర్థాలు నిలిచిపోతుండేవి. దీంతో మురుగు రోడ్డుపైకి, సమీపంలోని నివాసాల వద్దకు చేరేది. దీంతో శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో నాలుగేళ్ల క్రితం సుమారు కోటి రూపాయల వ్యయంతో మెకానికల్ ఎస్కలేటర్ మిషన్ (గెడ్డలో పేరుకున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు లారీకి లోడ్ చేసే యంత్రం)ను ఏర్పాటు చేశారు. ఈ మిషన్ కూడా ఫెయిల్ కావడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది.



గెడ్డ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

రాకపోకలకు అవస్థలు

మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇక్కడ గెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు వెళ్లే మార్గం లేక, రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో ఆ ప్రాంత వాసులు ఆ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. దీంతో బుధవారం ఉదయం ఈ మార్గంలో ప్రయాణించిన ద్విచక్ర వాహనచోదకులు మురుగులో బళ్లు ఎక్కడ అదుపు తప్పుతాయో అని ఆందోళన చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద గల గెడ్డ ఎప్పుడు వర్షం వచ్చినా పొంగిపోతుంది. ఈ కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కోట్లు ఖర్చు చేశారు, అయినా ఇలా ఎందుకు అవుతుందో. అధికారులు చర్యలు తీసుకోవాలి. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి.

– శీర రామకృష్ణ, స్థానికుడు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిలకవానిపాలెం 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకుంటుందని జోన్ -2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పిలకవానిపాలెం ,అన్నపూర్ణనగర్,ఉప్పరకాలనీ,శ్రీనివాస్‌నగర్,గొందేశివానిపాలెం ప్రాంతాలతో పాటు కోడిపందాలదిబ్బ ఏరియా,శ్రీనివాస్‌నగర్,గుల్లలపాలెం,రామ్‌నగర్,కుంచుమాంబ కాలనీ ప్రాంతాలకు ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో 'సాగర్ కవచ్ '



రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా డాగ్ స్క్వాడ్ ద్వారా బ్యాగుల్లో వస్తువులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేయడం కోసం సాగర్ కవచ్ దోహదపడుతుందని తెలిపారు. అంతేకాకుండా స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక శక్తులకు తావు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఏర్పడుతుందని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ డీజీ రావు తెలిపారు. రెండు రోజుల పాటు కార్యక్రమం సాగుతుందని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో 21 మంది పాల్గొంటారని తెలిపారు. హెచ్‌సీ వీఎస్ నారాయణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని ఆందోళన



మల్కాపురంలో ఖాళీ గ్యాస్ సిలిండర్ పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్,పెట్రోల్ ధరలు భారీగా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. పెరిగిన ధరలను నిరసిస్తూ 59వ వార్డు నెహ్రూనగర్‌లో బుధవారం సిలిండర్లు తలపై పెట్టుకుని వినూత్నంగా నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల అందిస్తామని చెప్పి ఇలా ధరలు పెంచడం దారుణమన్నారు. అసలు ఎంతమందికి ఇస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల బాధలను గుర్తించలేని కూటమి పాలకులు ఉన్నా ఒక్కటే.. లేకపోయినా ఒకటే అని ఎద్దేవా చేశారు. తక్షణమే పెంచి గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటారావు,జనార్దన్‌రావు,అప్పారావు,ఆర్.విమల తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లతో సీపీఐ రాస్తారోకో

మల్కాపురం: తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు.. ధరలను పెంచి ఆ ఆదాయంతో సంపదను సృష్టిస్తారా అని సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేంగుల సత్యాంజనేయ, గండి అప్పారావు ప్రశ్నించారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మల్కాపురం మెయిన్ రోడ్డు వద్ద ఖాళీ సిలిండర్‌ను పట్టుకుని బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని నమ్మించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ధరలు పెరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా కూటమి నాయకులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. పెంచిన ధరలను తగ్గించకుంటే తమ పార్టీ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నూనెల సూరిబాబు యాదవ్, వై.కామేశ్వరరావు, చంద్రశేఖర్, సత్తిబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్ఏ-2 పరీక్షలు

- డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం: పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్–2ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, ఐటీఐ కూడలి కప్పరాడ ఉన్నత పాఠశాలలను డీఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఏ-2 పరీక్షలను ఉపాధ్యాయులు పక్కాగా నిర్వహించి, మూల్యాంకనం అనంతరం మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

డ్రాపవుట్ విద్యార్థుల చేరిక

ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో చదివి, మూడు నెలలు క్రితం పాఠశాల మానివేసి డ్రాప్ అవుట్ అయిన దువ్వి వంశీకుమార్, రాజులను డీఈవో స్వయంగా పాఠశాలల్లో తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గోపాలపట్నం మండల పరిధిలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది డ్రాపవుట్ అయిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో చేర్పించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.దివాకర్, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు, గీత, సీఆర్పీలు లంక చైతన్య, పద్మ, లలిత, కరుణ తదితరులు పాల్గొన్నారు.



డ్రాపవుట్ విద్యార్థిని తిరిగి చేర్చుకుంటున్న డీఈవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో దివాకర్

లోకో పైలెట్ల డిమాండ్లు పరిష్కరించాలి

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రన్నింగ్ స్టాఫ్ అత్యవసర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ కోరారు. దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జోన్‌లో మాత్రమే రన్నింగ్ స్టాఫ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రైల్వే బోర్డు నిబంధనలను పాటించకుండా, రన్నింగ్ స్టాఫ్‌పై పని ఒత్తిడి అధికం చేస్తున్నారని తెలిపారు. జోన్ పరిధిలోని వాల్తేర్, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ డివిజన్లలో కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారన్నారు. ప్రధానంగా రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న ఆరు సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. లోకో సిబ్బందికి మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్లు వర్తింపజేయడం లేదని, తొమ్మిది గంటల పని వేళలకు దక్కవలసిన ప్రతిఫలం నిబంధన ఇక్కడ అమలు చేయడం లేదని, రన్నింగ్ సిబ్బందికి సరైన రెస్టరూంలు లేక విశ్రాంతి కూడా తీసుకోలేకపోతున్నారని తెలిపారు. ఈ విధంగా రైల్వే బోర్డు ప్రతిపాదించిన పలు నిబంధనలను ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో అమలు చేయడం లేదన్నారు. ఈ విషయమై మార్చి 26వ తేదీన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రమేష్ చంద్ర సాహూ, జనరల్ మేనేజర్‌కు 12 పేజీల వినతిపత్రం అందజేశామన్నారు. అయితే దీనిపై ఇంత వరకు స్పందించలేదని సంపత్‌కుమార్ తెలిపారు. రన్నింగ్‌స్టాఫ్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 18వ తేదీ నుండి నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. నరసింగరావు, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మాళీశ్వర్రావు, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్ఎల్ కోటేశ్వర్రావు, బి. సత్యనారాయణ, ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎంవీ పాపారావు, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఎం. రవికాంత్, బ్రాంచి సెక్రటరీలు కేవీ గిరిధర్, ఎస్. రాజశేఖర్, ఆర్. మోహన్‌బాబు, రన్నింగ్ స్టాఫ్ ఎంఎస్ రావు, ఆర్. మోహన్, పి. సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

గోపాలపట్నం: ఫీడర్ మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాజీ జంక్షన్, రెడ్డి వీధి, సుసర్ల కాలనీ, జయప్రకాష్‌నగర్, ఎస్సీ కాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వే స్టేషన్, నాయుడు క్వార్టర్స్ ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోపాలపట్నంలో నకిలీనోట్ల చలామణి



రూ.200 నకిలీ నోటు

గోపాలపట్నం: గోపాలపట్నంలో నకిలీ నోట్లు చలామణి కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గుర్తు తెలియని ఒక వ్యక్తి గోపాలపట్నంలోని ఓ మెడికల్ దుకాణానికి వచ్చి మందులు కొనుగోలు చేశారు. ఆయన ఇచ్చిన నగదులో ఒక రూ.200 నకిలీ నోటు వచ్చింది. ఐతే, ఆ సమయంలో దుకాణ యజమాని నోటును పరిశీలించలేదు. కొద్దిసేపటి తరువాత తాను పేమెంట్ చేసే సమయంలో చూడగా నకిలీ నోటుగా గుర్తించారు. దీన్ని ఏవిధంగా మార్చుకోవాలో అర్థం కావడం లేదని దుకాణ యజమాని వాపోతున్నాడు. డబ్బులు ఇచ్చి పుచ్చుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నోట్లను సరిగ్గా పరిశీలించిన తర్వాతే తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ కొత్తపాలెం గ్రామదేవత దుర్గమాంబ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు లేమర్తి, అగ్రహారం, పి.బోనంగి, కొత్తపాలెం, ఇ.బోనంగి, ఎదురువానిపాలెం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి సన్యాసిరావు, సతీష్, దాసరి నీలకంఠం, పితాని నీలకంఠరావు, కండేపల్లి శంకరరావు, చిన్నారావు, గోపి పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిన మున్సిపల్ కార్మికులు



సంతకాలు చేస్తున్న కార్మికులు

గాజువాక: తమ డిమాండ్ల సాధన కోసం సేకరించిన సంతకాల ప్రతులను మున్సిపల్ శాఖమంత్రి నారాయణకు సమర్పించడం కోసం మున్సిపల్ కార్మికులు విజయవాడ బయల్దేరారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గాజువాక జోన్ నుంచి కార్మికులు భారీ సంఖ్యలో చలో విజయవాడకు తరలివెళ్లారు. ఆప్కాస్‌ను రద్దు చేసి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, అనారోగ్యం పాలైన కార్మికుల బదులు పని చేస్తున్నవారి పేర్లు మార్చాలని, రిటైర్మెంట్, డెత్ పోస్టులు భర్తీ చేయాలని, 2023–24నాటి సమ్మె ఒప్పందాలకు సంబంధించిన జీవోలను అమలు చేయలనే డిమాండ్లపై కార్మికులు సంతకాల సేకరణ నిర్వహించారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



డీటీ సువర్ణకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

విశాఖ విద్య: పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం 2019 ముందు నుంచి ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదవాళ్లందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ యజమానులు, కొద్దిమంది ధనవంతులు పేదవాళ్లు నివసించే ఏరియాలను ఆక్రమించడం కోసం దొంగ కాగితాలు సృష్టించి పేదలకు పట్టాలివ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి దోపిడీదారులకు ఏమాత్రం లొంగకుండా ప్రభుత్వ స్థలాల్లో గృహం ఏర్పాటు చేసుకొని నివసించే పేదలందరికీ 30 జీవో ప్రకారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలిచ్చి ఇళ్ల రిజిస్ట్రేషన్లు కూడా చేయాలని కోరారు. దరఖాస్తు పెట్టిన నెల రోజుల్లో వాళ్లందరికీ పట్టాలు ఇవ్వాలని, లేదంటే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి పోరాడుతామన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సువర్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం గోపాలపట్నం జోన్ నాయకులు బి. వెంకటరావు, రమణి, అప్పారావు, అనసూయ, ఎం. ఈశ్వరరావు, శ్రావణ్, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గణేష్‌నగర్‌లో ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి
- పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభం

విశాఖ విద్య: ఆరోగ్యమే మహాభాగ్యం, దాన్ని కాపాడుకునేందుకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గణేష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల వేడుకలో ఆమె పాల్గొన్నారు. కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా కేంద్రానికి వచ్చిన గర్భిణులు, తల్లులు,చిన్నారులతో కలసి కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ జ్యోతి మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు ఆరోగ్యవంగా ఉంటే తల్లీ-బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. అదేవిధంగా సెక్టార్ పరిధిలోని ఆసపువానిపాలెం కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో కూడా ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ మార్త, ఆయా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

చండ్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు, సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు (సీఆర్) 31వ వర్ధంతి సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సీఆర్ వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులు అయ్యారన్నారు. ఆయన నిజాయితీ, నిబద్ధత గల నాయకుడని, ఆయన ఆశయాలు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆచరించినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినవారం అవుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సీఎస్ క్షేత్రపాల్, జి.కాసులరెడ్డి, ఎస్.నాగభూషణం, ఎస్.అప్పన్న, లక్ష్మణరావు, నూకరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.